క్లుప్తంగా

రాజేష్‌కు కళా పురస్కారం



రాజేష్‌కు కళా పురస్కారం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంబికా సంస్థల వ్యవస్థాపకుడు ఆలపాటి రామచంద్రరావు 98వ జయంతిని పురస్కరించుకొని ఏలూరు అంబికా భవన్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నగరానికి చెందిన నాట్యాచార్య గండికోట రాజేష్‌కు శ్రీ ఆలపాటి రామచంద్రరావు కళాపీఠం ఆధ్వర్యంలో 2024వ సంవత్సరానికి ఆలపాటి రామచంద్రరావు కళా పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంబికా సంస్థల అధినేతలు అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా శాలువా, నగదు పురస్కారంతో రాజేష్‌ను సత్కరించి, అభినందించారు. ప్రఖ్యాత కూచిపూడి నృత్య గురువు కళారత్న కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ రామచంద్రరావు సేవలను కొనియాడారు.

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో) : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గోదావరి సమావేశపు హాలు వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల సహాయ కేంద్రం, మోడల్ పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సహాయ కేంద్రం వద్ద ఓటరు నమోదుకు నిర్దేశించిన ఫారం-6, మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం-7, ఫారం-8లను పరిశీలించి వాటి నింపే విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మోడల్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈవీఎం, ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లను జాయింట్ కలెక్టర్ కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ, గృహనిర్మాణ శాఖ పీడీ కె.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, తహసీల్దార్ సోమశేఖర్, ఆర్టీసీ పీఆర్‌ఓ నరసింహారావులు పాల్గొన్నారు.

నేడు మోదీ, షాలకు వ్యతిరేకంగా ప్రదర్శన

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ, షా విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏలూరు పాతబస్టాండ్ సెంటర్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహిస్తామని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర నాయకులు ఘడసాల రాంబాబు, మంగరాజు రాము, ఈశ్వరరావు, రమణ, పల్లి గంగరాజు, నెహ్రూబాబు, గుంటుపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త వీరయ్య మృతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త త్రినాథ్ వస్త్ర దుకాణాల అధినేత, హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు శలా కోటి వీరయ్య (65) మృతి చెందారు. ఆయన గుండె సంబంధిత అనారోగ్యంతో విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. వీరయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సంస్థ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, సభ్యులు వీరయ్య మృతదేహం వద్ద నివాళులర్పించగా, ప్రధాన కార్యదర్శి కేవీ సత్యనారాయణ, ప్రతినిధులు కానాల బాల వెంకట రమేష్, జవ్వాజి మోహన్ విఠల్, మజ్జి కాంతారావు, గాదంశెట్టి శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

ఇళ్ల స్థల పట్టాల పంపిణీ

దెందులూరు: దెందులూరు కాశీకాలనీలో గురువారం 111 మందికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు ఇళ్ల స్థల పట్టాలను వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తొత్తడి వేదకుమారి, పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, నాయకులు ఐనంపూడి రాము, తొత్తడి కృష్ణ పంపిణీ చేశారు. కాశీ కాలనీ వాసుల ఇబ్బందులను నాయకులు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించడంతో ఎమ్మెల్యేకు కాశీ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని నింపేలా 'ఆడుదాం ఆంధ్ర'

- ముగిసిన నియోజకవర్గ స్థాయి పోటీలు
- విజేతలకు బహుమతులు, షీల్డులు, పతకాలు, సర్టిఫికెట్ల ప్రదానం

ఏలూరు రూరల్: 'ఆడుదాం ఆంధ్ర' యువతీ యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసిందని ఏలూరు నగర కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ అన్నారు. గురువారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఏర్పాటుచేసిన ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎందరో క్రీడాకారులకు తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించేందుకు అవకాశం దక్కిందన్నారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి వల్ల క్రీడా రంగం అభివృద్ధి చెందుతోందని అన్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు ఉద్యోగాలు అందుకున్నారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ ఫైనల్స్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు షీల్డులు, మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు చొప్పున చెక్కులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు త్వరలో నిర్వహించే జిల్లా స్థాయిలో పోటీల్లో పాల్గొంటాయని డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నల జాన్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.



కబడ్డీ ఫైనల్స్‌లో తలపడుతున్న లంకపేట, సత్రంపాడు జట్లు



ఖోఖో క్రీడలో తలపడుతున్న క్రీడాకారిణులు



షీల్డ్ అందుకున్న పురుషుల బ్యాడ్మింటన్ విజేత శేఖర్‌వీధి సచివాలయ జట్టు



మహిళల బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన శేఖర్‌వీధి సచివాలయం జట్టు



వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించిన మోతేవారితోట సచివాలయం జట్టు



ఖోఖోలో ప్రథమ స్థానం సాధించిన వెంకటాపురం జట్టు

విజేతలు వీరే

కబడ్డీ

పురుషుల విభాగం : లంకపేట సచివాలయం జట్టు, సత్రంపాడు జట్టు, గొల్లాయిగూడెం జట్టు, మహిళల విభాగంలో అశోక్‌పిల్లర్ సచివాలయం, వెంకటాపురం-6, అరుంధతిపేట జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి.

ఖోఖో

పురుషుల విభాగం : గొల్లాయిగూడెం, పత్తేబాద్, తంగెళ్లమూడి జట్లు

మహిళల విభాగం : వెంకటాపురం-6, గొల్లాయిగూడెం, ఎంఆర్‌సీ కాలనీ జట్లు

వాలీబాల్

పురుషుల విభాగం : శాంతినగర్ సచివాలయం, కొమడవోలు సచివాలయం, పత్తేబాద జట్లు

మహిళల విభాగం : మోతేవారితోట-3, వెంకన్న చెరువు, సత్రంపాడు-2 జట్లు

బ్యాడ్మింటన్ డబుల్స్

పురుషుల విభాగం : శేఖర్‌వీధి సచివాలయం జట్టు క్రీడాకారులు ఆదిరెడ్డి గుణశ్రీకర్, వంశీకృష్ణ, రామచంద్రరావుపేట సచివాలయం, తంగెళ్లమూడి జట్లు.

మహిళల విభాగం : శేఖర్‌వీధి జట్టు క్రీడాకారిణులు ఆర్ శ్రీలక్ష్మి, ఆర్ రజని, వెంకటాపురం-4, గొల్లాయిగూడెం-2 జట్లు

క్రికెట్

పురుషుల విభాగం : అశోక్‌పిల్లర్, సత్రంపాడు-2, శాంతినగర్ జట్లు. **మహిళల విభాగం** : గొల్లాయిగూడెం-2, యాదవనగర్-1 జట్లు

సీఎం జగన్‌తోనే పేదలకు మేలు





7వ డివిజన్ సచివాలయంలో రేషన్ కార్డు అందజేస్తున్న శ్రీలక్ష్మి, బాలగంగాధర్ తిలక్ స్కూల్లో ట్యాబ్‌లు పంపిణీ చేసిన పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారని, నాడు - నేడు పథకంలో ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్ది అత్యున్నత ప్రమాణాలతో విద్యార్థులకు విద్యను అందించేలా చర్యలు చేపట్టారని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. ఏలూరు 7వ డివిజన్‌లోని బాలగంగాధర్ తిలక్ నగరపాలక పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, 10వ తరగతి విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రభుత్వరంగ విద్య నిర్వీర్యమైందని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను చంద్రబాబు ప్రోత్సహించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు నాడు కనీసం పిల్లలకు పుస్తకాలు, యూనిఫామ్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు తెరిచే నాటికే జగనన్న విద్యాకానుక రూపంలో పుస్తకాలు, బ్యాగ్, షూస్, టై అన్ని అందజేసి పేద విద్యార్థుల ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్నారని చెప్పారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, డిజిటల్ విద్య, అందుబాటులో వచ్చిందని తెలిపారు. సంపన్న వర్గాలకే పరిమితమైన నాణ్యమైన విద్యను పేదల చెంతకు చేర్చారని వివరించారు.

రేషన్ కార్డుల పంపిణీ

ఏలూరు 7వ డివిజన్ సచివాలయంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కొత్తగా రేషన్‌కార్డులు తీసుకోవాలంటే రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సివచ్చేదని, ఒక్కోసారి తిరిగినా రాకపోవడంతో పేదలు చేసేదేమీ లేక మిన్నకుండేవారని గుర్తుచేశారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే రేషన్‌కార్డులు, ఇళ్లు, పెన్షన్లు, ఇలా అన్ని సేవలు సకాలంలో అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షద్రక్, ఉపాధ్యాయులు కొల్లిపర భగవాన్, శివమ్మ, మరియమ్మ, రాము, రఫీ, షమ్మి, మహేష్ తదితరులున్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

ఏలూరు(మెట్రో): 'ఓటు వేయడం లాంటిది మరొకటి లేదు.. నేను తప్పకుండా ఓటు వేస్తాను' అనే ఎన్నికల సంఘం 2024 సంవత్సరం నినాదంతో జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయం సిబ్బంది 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా పంచాయతీ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికల నియమావళి మేరకు ఉద్యోగులు విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు కిషోర్, సురేష్, జూనియర్ సహాయకులు సునీత, విజయ తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని

ఏలూరు (టూటౌన్): వజ్రాయుధం లాంటి ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ - ప్రజల వినియోగం అనే అంశంపై స్థానిక నరసింహారావుపేటలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం కుల, మతాలతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడూ ఓటు హక్కు వినియోగిస్తున్నట్టు చెప్పారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ పీఠికపై విద్యా సంస్థల్లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పౌరులంతా పరిరక్షించుకోవాలని సూచించారు. పలువురు అంబేడ్కర్ వాదులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్

11న పెదతాడేపల్లిలో బీసీల బహిరంగ సభ

ఏలూరు (టూటౌన్) : బీసీల హక్కుల సాధన కోసం వచ్చే నెల 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిగూడెం సమీపంలోని పెదతాడేపల్లిలో బీసీల బహిరంగ సభ నిర్వహించనున్నట్టు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో నిర్వహించే జనగణనలో సమగ్ర కులగణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని కోరారు. బీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, బీసీ సబ్‌ప్లాన్, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, ఏ, బీ, సీ, డీల వర్గీకరణ, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అన్నారు. బీసీలకు క్రీమీలేయర్, బీసీల అట్రాసిటీ యాక్ట్ ప్రవేశపెట్టాలని కోరారు. రెండేళ్ల నుంచి బీసీల హక్కుల సాధనకు బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బీసీల బహిరంగ సభకు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, బీసీ ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల్లోని బీసీ నాయకులు, రాష్ట్రంలోని పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీసీలు సభకు తరలి రావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు బుజ్జి, ఎ.శివశ్రీ, ఎ.త్యాగరాజాచారి, మల్లిపూడి రాజు, కట్టా శ్రీనివాస్, సర్నాల శివవాణి, మొరాల లక్ష్మణ స్వామి గౌడ్, ఆలమండ రామారావు, పిచ్చుక ఆదిశేషు, తెంటు సూర్యనారాయణ, ఆరేపల్లి శ్రీనివాస్, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



బీసీ బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలుద్దాం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): త్వరలో జరిగే అవినీతికి, అభివృద్ధికి మధ్య యుద్ధంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెరుగైన సమాజం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి సంఘం కార్యదర్శి గుడిమెట్ల శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఒకే ఒక్కడిగా జగన్ పేద, మధ్య తరగతి కుటుంబాలకు తనవల్ల మేలు జరిగితేనే తన పక్కన నిలబడండి అని కోరడంలోనే ఆయన నిజాయితీ కనపిస్తోందని చెప్పారు. నీచ రాజకీయాలకు, దిగజారుడుతనానికి వత్తాసు పలికే కొన్ని రాజకీయ పార్టీలు షర్మిలను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకురావడం, రాష్ట్రాన్ని అన్యాయంగా విడగొట్టిన కాంగ్రెస్ తరపున ఆమెను రాష్ట్రంలో అన్నకు వ్యతిరేకంగా పని చేయించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని నడిరోడ్డుపై నిలబెట్టిన కాంగ్రెస్ ఈ రాష్ట్రంలో బతకడానికి ఆయుధాల్లేక వైఎస్సార్ కుటుంబంలో చీలిక తీసుకొచ్చిందని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోన్న జగన్‌మోహన్‌రెడ్డి కావాలా? అందరూ కలిపి ఒకడిపై దండయాత్ర చేస్తున్న దుష్ట కౌరవులు కావాలో ప్రజలు తేల్చుకోవాలని సూచించారు.





ఫైనల్ రిహార్సల్స్‌లో జిల్లా ఎస్పీ మేరీప్రశాంతి, కవాతు చేస్తున్న పోలీస్ సిబ్బంది

పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో కవాతు

ఏలూరు టౌన్: ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధంచేసింది. ఈ ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి గురువారం పరిశీలించారు. పోలీస్ సిబ్బంది ఫైనల్ రిహార్సల్స్‌ను పరిశీలించి కవాతులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా ప్రతిష్ఠను గౌరవాన్ని పెంచేలా క్రమశిక్షణతో కవాతు నిర్వహించాలని ఆదేశించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	30
వంకాయలు (కాంతులు)	24	బీర్లచిక్కుడు	40
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	60
బెండకాయలు	54	ములక్కాడలు	10-12
పచ్చిమిర్చి	40	కంద	60
కాకర కాయలు	48	బీట్‌రూట్	34
బీరకాయలు	50	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	60	ఫ్రెంచ్‌బీన్స్	74
క్యాబేజీ	30	అల్లం	120
క్యారెట్	36-40	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	20	పాలకూర	10
బంగాళదుంపలు	36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	26-30	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	08
దోసకాయలు	40-44	పుదీనా	05
అనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	78
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	21
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	31